www.netifocusnews.com

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

బుధవారం 26, నవంబర్ 2025 వెల: రూ.4/- సంపుటి: 01 సంచిక: 40 పేజీలు: 04

Published From: Hyderabad Editor: Mankali Tharun






# జీహెచ్ఎంసీ విస్తరణ

## 20 మునిసిపాలిటీలు, 7 కార్పొరేషన్ల విలీనానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం

- 2 కోట్ల జనాభాతో మినీ తెలంగాణగా అవతరణ
- 2,735 చదరపు కి.మీ.తో దేశంలోనే అతిపెద్ద నగరం
- ఓఆర్ఆర్ దాకా ఒకే రకమైన పట్టణ ప్రణాళిక
- అధ్యయనానికి జీహెచ్ఎంసీ కౌన్సిల్ ఆమోదం
- గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. 1-2 నెలల్లో డివిజన్ల పునర్విభజన, కార్పొరేషన్ల విభజన పూర్తి.. అధికార వర్గాల వెల్లడి

హైదరాబాద్ ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్)-నవంబరు 25:

గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) విస్తరణకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జీహెచ్ఎంసీకి ఔటర్ రింగు రోడ్డును సరిహద్దుగా నిర్ణయించింది. దీంతో హైదరాబాద్ మహానగరం దేశంలోనే అతిపెద్ద నగరంగా అవతరించనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో హైదరాబాద్ శివారులో ఉన్న 20 మునిసిపాలిటీలు, 7 కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అందుకోసం జీహెచ్ఎంసీ, తెలంగాణ మునిసిపాలిటీ చట్టాలను సవరించడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపిందని సమావేశం అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మీడియా సమావేశంలో తెలిపారు. విలీన ప్రక్రియలో అన్ని వర్గాలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. విలీనం కానున్నమునిసిపాలిటీల్లో కొన్నింటి పరిధి ఓఆర్ఆర్ అవతల కూడా విస్తరించి ఉంది. ప్రస్తుతం 150 మునిసిపల్ డివిజన్లతో ఉన్న జీహెచ్ఎంసీ పరిధి కొత్తవాటి విలీనంతో మూడింతలు పెరగనుంది. నగర పరిధి దాదాపు 2,735 చదరపు కిలోమీటర్లు ఉండనుంది. జనాభా దాదాపు రెండు కోట్లు ఉంటుంది. తాజాగా విలీన కానున్న 27 మునిసిపాలిటీలు, కార్పొరేషన్లపాలక మండళ్ల గడువు మిగతా 2లో..



# మోగిన నగారా

## పంచాయతీ ఎన్నికల ప్రక్రియ షురూ.. నోటిఫికేషన్ విడుదల చేసిన ఎస్ఇసి

- అమల్లోకి ఎన్నికల కోడ్..
- రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- 12,728 సర్పంచ్, 1,12,242 వార్డు సభ్యుల స్థానాలకు మూడు విడతలుగా ఎన్నికలు
- వచ్చే నెల 11, 14, 17 తేదీల్లో పోలింగ్..
- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట దాకా..
- 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ..
- ఇద్దరికన్నా ఎక్కువ మంది పిల్లలున్నా పోటీకి అర్హులే
- రాష్ట్రంలో గ్రామీణ ఓటర్లు 1,66,55,186 మంది..
- మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువ



హైదరాబాద్ ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్)-నవంబరు 25:

తెలంగాణలో గ్రామపంచాయతీ ఎన్నికల నగారా మోగింది. గురువారం (నవంబరు 27) ప్రారంభమయ్యే సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల ప్రక్రియ.. డిసెంబర్ 17 నాటికి పూర్తికానుంది. ఈమేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని మంగళవారం షెడ్యూల్ విడుదల చేశారు. ఎస్ఈసీ కార్యాల యంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ సృజన, పోలీసు ఉన్నతాధికారులతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 12,728 సర్పంచ్ స్థానాలకు, 1,12,242 వార్డు సభ్యుల స్థానాలకు మొత్తం 3 విడతల్లో ఎన్నికలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. పోలింగ్ పూర్తయిన తర్వాత.. అదేరోజు ఓట్ల లెక్కింపు జరిపి, ఫలితాలను ప్రకటించనున్నట్లు తెలిపారు. డిసెంబరు 11, 14, 17 తేదీల్లో పోలింగ్ ఉంటుందని.. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు. అదే సమయంలో ఉపసర్పంచ్ ఎన్నిక ప్రక్రియను సంబంధిత మిగతా 2లో..



సమర్ధంగా

# రైతువేదికల వినియోగం

- విత్తన చట్టం ముసాయిదాపై వివరించాం..
- 5 మార్కెట్ కమిటీలకు కొత్త పాలకవర్గాలు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

హైదరాబాద్ ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్)- నవంబరు 25:

'గత ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించి, నిరూపయోగంగా వదిలేసింది. ప్రజా ప్రభుత్వం ఆ రైతు వేదికల్లో దృశ్య, శ్రవణ మాధ్యమాలను ఏర్పాటుచేసి సమర్థంగా వినియోగిస్తోంది. రైతులను భాగస్వాములను చేస్తోంది' అని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం సచివాలయం నుంచి రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 30 వేల మంది రైతులు రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారని, ప్రభుత్వ పథకాలు, విత్తన చట్టం ముసాయిదాపై వివరించినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నదని మిగతా 2లో..

అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులకు

# గమ్యస్థానం హైదరాబాద్

- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సులో బ్రాండింగ్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- పెట్టుబడులను ఆకర్షించేలా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు ప్రచారం ఉండాలి
- తెలంగాణ గతం, వర్తమానం, భవిష్యత్‌లను ప్రతిబింబించాలి
- మన కళలు, ప్రముఖులను ప్రచారంలో వినియోగించాలి
- ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం దిశానిర్దేశం



హైదరాబాద్ ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్)-నవంబరు 25:

అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులకు గమ్యస్థానంగా హైదరాబాద్ నిలిచేలా 'తెలంగాణ రైజింగ్' గ్లోబల్ సదస్సులో బ్రాండింగ్ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్దేశించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో విభాగాల వారీగా చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతి అంశం కూడా ప్రచారంలో ప్రముఖంగా ఉండేలా చూడాలని సూచించారు. పెట్టుబడిదారులకు రాష్ట్రం కల్పించే సదుపాయాలను సమగ్రంగా వివరించాలని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా.. భారత్ ఫ్యూచర్ సిటీలో వచ్చే నెల మిగతా 2లో..

## ప్రభుత్వ పథకాలకు ఓ డిస్కమ్!



- కొత్త డిస్కమ్ ఏర్పాటుకు మంత్రివర్గం నిర్ణయం
- వ్యవసాయ పంపుసెట్లు, ఎత్తిపోతలపథకాలు, నీటిపారుదల ప్రాజెక్టుల కనెక్షన్లన్నీ దీని పరిధిలోకే
- 10వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజీలో పెట్టుబడులకు ఆహ్వానం
- క్యాబినెట్ భేటీలో నిర్ణయాలు వెల్లడించిన మంత్రి శ్రీధర్‌బాబు



డీసీసీ అధ్యక్షుడిగా

# కైలాష్ సరికాదు

- అతడిని తప్పించండి.. సమర్థులకు అవకాశమివ్వండి.. తనను, తన కుటుంబ సభ్యులను దుర్భాషలాడారు
- ఆ వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు
- సీఎం, పీసీసీ చీఫ్, ఏఐసీసీ నేతలకు మంత్రి కోమటిరెడ్డి ఫిర్యాదు
- మంత్రివర్గ సమావేశంలోనూ ప్రస్తావన

నల్లగొండ, (ఫోకస్‌న్యూస్)-నవంబరు 25:

(ప్రతినిధి): నల్లగొండ డీసీసీ అధ్యక్షుడిగా వున్న కైలాష్ నేత సరికాదని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. డీసీసీ బాధ్యతల నుంచి కైలాష్‌ను తప్పించి, సమర్థులకు అవకాశం ఇవ్వాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడిగా తాజాగా నియమితులైన కైలాష్ తనను, మిగతా 2లో..

# నవంబరు 25.. బీసీలకు చీకటి రోజు

## 30న బీసీల యుద్ధభేరి

- డిసెంబరు 8,9 తేదీల్లో చలో ఢిల్లీ: జాజుల
- బీసీల గొంతుకోసిన సర్కారు: ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-నవంబరు 25:

రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని అనేక సందర్భాల్లో హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం, దానిని విస్మరించి బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నవంబరు 25ను బీసీలకు చీకటి రోజు, విద్రోహ దినంగా ప్రకటించారు. తెలంగాణలో బీసీలు సర్పంచులు కాకుండా కుట్రతో రిజర్వేషన్లు తగ్గించారని, రొటేషన్ పేరుతో బీసీల గొంతు కోశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'బీసీలకు జరిగిన అన్యాయం– భవిష్యత్ కార్యాచరణ'పై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ తదితరులతో కలిసి జాజుల మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసినా, బీసీ ఉద్యమాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. ఈ నెల 30న హైదరాబాద్‌లో బీసీల యుద్ధభేరి నిర్వహిస్తామని, డిసెంబరు 8,9 తేదీల్లో చలో ఢిల్లీకి పిలుపునిస్తున్నామని, పార్లమెంటును ముట్టడిస్తామని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మీద పెద్ద ఎత్తున పోరాటం చేసి రిజర్వేషన్లు సాధించుకుంటామని ఆయన అన్నారు.

### బీసీల గొంతుకోసిన సర్కారు: ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో జిల్లాను యూనిట్‌గా రిజర్వేషన్లు ఖరారు చేయడంతో బీసీలకు అన్యాయం జరిగిందని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని రిజర్వేషన్లను ఖరారు చేయాలన్నారు. మిగతా 2లో..

## డీసీసీ అధ్యక్షుడిగా కైలాష్ సరికాదు

(మొదటి పేజీ తరువాయి)

తన కుటుంబ సభ్యులను అవమానించే రీతిలో అకారణంగా దుర్భాషలాడిన వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని వెంకటరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, పీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌కు లేఖలు రాశారు. ఆ వీడియోలను, వాటి సమాచారాన్ని సైతం పెన్‌డ్రైవ్‌ల ద్వారా అందజేశారు. కైలాష్ గతంలో తనను ఇలాగే దూషించినా తాను ఏమీ అనలేదని, ఇప్పుడు బాధ్యత కలిగిన పదవిలోకి వచ్చిన తర్వాత కూడా అసభ్యకర పదజాలంతో ఉన్న వీడియోలను వైరల్ చేయించడం తనకు ఆవేదన కలిగించిందని వెంకటరెడ్డి పేర్కొన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్నారు. కైలాష్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, అతడిని డీసీసీ అధ్యక్ష పదవి నుంచి తప్పించి, సమర్థులకు అవకాశం ఇవ్వాలని సీఎంకు రాసిన లేఖలో కోరారు. తన రాజకీయ జీవితంలో ఏనాడూ ఎవరిపైనా వ్యక్తిగతంగా కక్ష సాధింపు ధోరణికి పాల్పడలేదని, అయిదుసార్లు ఎమ్మెల్యేగా, ఒక పర్యాయం ఎంపీగా గెలిచానని, తెలంగాణ కోసం నాడు మంత్రి పదవిని త్యజించానని పేర్కొన్నారు. మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలోనూ వెంకటరెడ్డి ఈ అంశాన్ని ప్రస్తావించి ఆవేదన వ్యక్తం చేయగా సీఎం, ఇతర మంత్రులు సముదాయించినట్లు తెలిసింది. కాగా, మంత్రి ఫిర్యాదును సీఎం, పీసీసీ చీఫ్ సీరియస్‌గా తీసుకున్నట్లు కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. డీసీసీ బాధ్యతల విషయంలో ఏం చేయాలనే అంశంపై జిల్లా ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలతో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని స్థానికంగా చర్చ సాగుతోంది. పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైన సందర్భంలో డీసీసీ అధ్యక్ష వ్యవహారంపై రాజకీయ రచ్చ రేగడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మంత్రి వెంకటరెడ్డి స్వయంగా ఫిర్యాదు చేయడంతో ఈ విషయంపై మాట్లాడేందుకు, ప్రస్తావించేందుకు ఇతర నేతలెవరూ సుముఖత చూపలేదు. సీఎం, పార్టీ అధిష్ఠానమే నిర్ణయం తీసుకుంటుందని పేర్కొంటున్నారు. ఈ విషయమై కైలాష్‌ను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా తాను మంగళవారం ఉదయం మంత్రి వెంకటరెడ్డిని కలిసి క్షమాపణ కోరానని తెలిపారు. పెద్ద మనసుతో తనను క్షమించాలని, నల్లగొండ జిల్లాలో ఆయన సూచనలు, సలహాల మేరకు పనిచేస్తానని తెలిపానని చెప్పారు.

## సమర్థంగా రైతువేదికల వినియోగం

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. ఈ సందర్భంగా జాతీయ ఆహార భద్రత మిషన్ పథకం ద్వారా వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. 16 జిల్లాల్లోని రైతులకు సబ్సిడీపై 5,500 క్వింటాళ్ల వరి విత్తనాలను అందించారు. కాగా, రాష్ట్రంలో ప్రారంభంకాని జిన్నింగ్ మిల్లులను వెంటనే ప్రారంభించాలని, పత్తి కొనుగోళ్లు ఎప్పటికప్పుడు చేపట్టాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, జిన్నింగ్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డితో ఆయన మాట్లాడారు. జిన్నింగ్ మిల్లర్లు సమ్మె విరమించి కొనుగోళ్లు ప్రారంభిస్తామని చెప్పినప్పటికీ.. పూర్తిస్థాయిలో మిల్లులు తెరవలేదని అన్నారు. పత్తి రైతులకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని తుమ్మల ఆదేశించారు.

### 5 మార్కెట్ కమిటీలకు కొత్త పాలకవర్గాలు

రాష్ట్రంలో ఐదు మార్కెట్ కమిటీలకు కొత్త పాలకవర్గాలు నియమించినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. సిద్దిపేట జిల్లా తొగుట, దౌల్తాబాద్, మిరుదొడ్డి, దుబ్బాక, చేగుంట మార్కెట్లకు చైర్మన్లు, వైస్‌చైర్మన్లతో పాటు సభ్యులను నియమించినట్లు వెల్లడించారు.

## నవంబరు 25.. బీసీలకు చీకటి రోజు(

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు ప్రకటించిన రిజర్వేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ జేఏసీ కో–ఆర్డినేటర్ గుజ్జ సత్యం ఆధ్వర్యంలో బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. రిజర్వేషన్లను 22శాతానికి తగ్గించి ప్రభుత్వం బీసీల గొంతు కోసిందని ధ్వజమెత్తారు. జీవో 46ను బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బీసీలకు రిజర్వేషన్లను అమలు చేస్తూ ఎన్నికలు నిర్వహించాలన్నారు. జీవో 46ను రద్దు చేయాలన్న డిమాండ్‌తో బుధవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరాహార దీక్షలు, ధర్నాలు నిర్వహిస్తామని కృష్ణయ్య తెలిపారు.



## మద్యం దుకాణాల సంఖ్య ఇలాగే పెరిగితే.. రాష్ట్రానికి కొత్త పేరు పెట్టాల్సి వస్తుంది!

హైకోర్టు వ్యాఖ్య

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)- నవంబరు 25:

రాష్ట్రంలో మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్ల సంఖ్య వేగంగా పెరిగిపోతుండటంపై హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇదే వేగంతో మద్యం దుకాణాలు బార్ల సంఖ్య పెరిగితే తెలంగాణ రాష్ట్రానికి కొత్త పేరు పెట్టాల్సి వస్తుందని వ్యాఖ్యానించింది. అయితే మద్యం వినియోగం, దుకాణాల సంఖ్య విషయంలో హైకోర్టు పాత్ర పరిమితమేనని అభిప్రాయపడింది. మద్యం దుకాణాల ప్రకటనల బోర్డులు కనీసం ప్రధాన రహదారి నుంచి కనిపించని విధంగా ఉండాలని తెలిపింది. దీనిపై ప్రభుత్వం ఒక విధానపర నిర్ణయం తీసుకునే వరకు తాము మార్గదర్శకాలు జారీచేయాల్సి ఉందని పేర్కొంది. నాగారం మున్సిపాల్టీ పరిధిలోని శ్రీ సత్యనారాయణ కాలనీలోని నివాస గృహాల మధ్యలో లిక్కర్ షాప్ పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ కాలనీ సంక్షేమ సంఘం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. వివరణ ఇవ్వాలని ఎక్సైజ్ శాఖ, మున్సిపల్ అధికారులకు, దుకాణదారులకు నోటీసులు జారీచేస్తూ విచారణను వాయిదా వేసింది.



# అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులకు గమ్యస్థానం హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సును నిర్వహించనున్న విషయం తెలిసిందే. దేశ, విదేశీ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఇతర రంగాల ప్రముఖులు పాల్గొననున్న నేపథ్యంలో.. సదస్సుకు బ్రాండింగ్ చేయడంపై సీఎం మంగళవారం రాత్రి సమీక్ష నిర్వహించారు. వివిధ సంస్థలు రూపొందించిన ప్రచార చిత్రాలు, వీడియోలను వీక్షించి పలు మార్పులు, చేర్పులు సూచించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. భారత్ ఫ్యూచర్ సిటీలో అభివృద్ధి పనులు, సదుపాయాలను పెట్టుబడిదారులకు సమగ్రంగా వివరించాలని సూచించారు. హైదరాబాద్‌కు అనుకూల అంశాలైన ఇన్నర్ రింగు రోడ్డు, ఔటర్ రింగు రోడ్డు, రానున్న రీజనల్ రింగు రోడ్డు, బందరు పోర్టుకు గ్రీన్‌ఫీల్డ్ హైవే, రైలు మార్గం, డ్రైపోర్ట్‌తోపాటు తెలంగాణలోని కళా, సాంస్కృతిక, భాష, వాతావరణ అనుకూలతలను వివరించాలని నిర్దేశించారు. రాష్ట్రంలో 1999 నుంచి ఇప్పటి వరకు ఎన్ని ప్రభుత్వాలు మారినా విధానపరమైన నిర్ణయాల్లో ఎటువంటి మార్పులేని అంశాన్ని, పెట్టుబడుల విషయంలో మద్దతుగా నిలుస్తున్న విషయాన్ని ప్రత్యేకంగా వివరించాలని సూచించారు. తెలంగాణ బ్రాండింగ్‌కు సంబంధించి మన రాష్ట్రానికే పరిమితమైన, వైవిధ్యమైన ప్రత్యేకతలను చేర్చాలని సమీక్షలో సీఎం సూచించారు. రామప్ప నంది, సమ్మక్క సారక్క జాతర, నల్లమల పులులు, మహబూబ్‌నగర్ జిల్లాకే ప్రత్యేకమైన ఎద్దులు, తెలంగాణ నుంచి జాతీయ రాజకీయాలను శాసించిన పీవీ వంటి ప్రముఖులు, కళాకారులు, క్రీడాకారులు, అంతర్జాతీయ కంపెనీలకు నాయకత్వం వహిస్తున్న ప్రముఖులు ఇలా ప్రతి అంశానికి బ్రాండింగ్‌లో చోటు కల్పించాలని చెప్పారు. పత్రికలు, చానళ్లు, డిజిటల్ వేదికలను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. సమీక్షలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు ఏర్పాట్లు, నిర్వహణ, ఇతర అంశాలపై సీఎం ప్రతిరోజూ సమీక్ష నిర్వహించనున్నారు. బుధవారం రవాణా ఏర్పాట్లపై మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష ఉంటుంది. 27న సదస్సు కోసం కల్పించే మౌలిక వసతులపై మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, సీతక్క, అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. 28న సాయంత్రం 4 గంటలకు విద్య, యువజన సంక్షేమంపై మంత్రులు వాకిటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి, అధికారులతో.. సాయంత్రం 6 గంటలకు పర్యాటకం, టెంపుల్ టూరిజంపై మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖలతో సమీక్షిస్తారు. 29న సాయంత్రం 4 గంటలకు వ్యవసాయం, సంక్షేమ విభాగాలపై మంత్రులు తుమ్మల, ఉత్తమ్, వాకిటి శ్రీహరి, సంబంధిత అధికారులతో.. సాయంత్రం 6 గంటలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, అజారుద్దీన్‌లతో సమావేశాలు నిర్వహిస్తారు. 30న ఆరోగ్య రంగంపై మంత్రి రాజనర్సింహ, అధికారులతో సమీక్షిస్తారు.

## ప్రభుత్వ పథకాలకు ఓ డిస్కమ్!

- కొత్త డిస్కమ్ ఏర్పాటుకు మంత్రివర్గం నిర్ణయం
- వ్యవసాయ పంపుసెట్లు, ఎత్తిపోతల పథకాలు, నీటిపారుదల ప్రాజెక్టుల కనెక్షన్లన్నీ దీని పరిధిలోకే
- 10వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజీలో పెట్టుబడులకు ఆహ్వానం
- క్యాబినెట్ భేటీలో నిర్ణయాలు

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-నవంబరు 25:

రాష్ట్రంలో కొత్తగా మరో విద్యుత్తు పంపిణీ సంస్థ (డిస్కమ్) ఏర్పాటు కానుంది. ఉచిత కరెంటు అం దించే వ్యవసాయ కనెక్షన్లతోపాటు వివిధ ప్రభుత్వ పథకాలకు చెందిన కనెక్షన్లకు విద్యుత్తు సరఫరా బా ధ్యతను చూసేందుకుగాను ప్రత్యేకంగా డిస్కమ్‌ను ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించింది. వ్యవసాయ పంపుసెట్లు, ఎత్తిపోతల పథకాలు, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ సీవరేజీ బోర్డు, మిషన్ భగీరథ, గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థ కనెక్షన్లను ఈ డిస్కమ్ పర్యవేక్షించనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న టీజీఎస్పీడీసీఎల్ (దక్షిణ డిస్కమ్–హైదరాబాద్), టీజీఎన్పీడీసీఎల్(ఉత్తర డిస్కమ్–వరంగల్)కు అదనంగా మూడో డిస్కమ్ రానుంది. మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో మూడో డిస్కమ్‌పై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ఆ వివరాలను పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బా బు.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రు లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి వెల్లడించారు. 28,89,921 వ్యవసాయ పంపుసెట్లు, 429 దాకా ఉన్న ఎత్తిపోతల పథకాల కనెక్షన్లు, వాటర్ బోర్డుకు చెందిన 60 కనెక్షన్లు, మిషన్ భగీరథ/గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థకు చెందిన 276 కనెక్షన్లు కలుపుకొని 28,90,686 కనెక్షన్లతో ఈ డిస్కమ్ ఏర్పాటు కానుందన్నారు. రానున్న పదేళ్లలో విద్యుత్ డిమాండ్, ఉత్పత్తిపై ఇంధన శాఖ అధికారులు ఇచ్చి న పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను మంత్రివర్గం పరిశీలించిందని శ్రీధర్‌బాబు చెప్పారు. ఆపై.. వచ్చే ఐదేళ్ల కోసం 3వేల మెగావాట్ల సౌరవిద్యుత్, 2వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జలవిద్యుత్ అందించే సంస్థల నుంచి విద్యుత్ సరఫరా కోసం టెండర్లు పి లవాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో మరో 10వేల మెగావాట్ల పంప్డ్‌స్టోరేజీ జలవిద్యుత్ కేంద్రం ఏర్పాటుకు అనుకూలత ఉండటంతో ఆ రంగంలో పెట్టుబడులను ఆహ్వానించాలని నిర్ణయం తీసుకున్న ట్లు పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన భూమిని.. ఆ కేంద్రం నుంచి డిస్కమ్‌లకు కరెంట్ సరఫరా చేయాలనే షరతుతో ఇవ్వాలని నిర్ణయించామన్నారు.

# మోగిన నగారా

(మొదటి పేజీ తరువాయి)

విభాగాలు పూర్తిచేస్తాయని చెప్పారు. ప్రభుత్వం జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్ ఆధారంగా.. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ఖరారు చేసినట్లు ఎస్ఈసీ వెల్లడించారు. పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో.. తక్షణమే రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని స్పష్టంచేశారు. ఈసీఐ అందజేసిన ఓటరు జాబితాను ఆధారంగా చేసుకొని తుదిఓటరు జాబితాను గ్రామపంచాయతీ, వార్డుల వారిగా ఇప్పటికే సిద్ధం చేసినట్టు రాణి కుముదిని వివరించారు. విడతల వారీగా చేపట్టే ఈ ఎన్నికలకు సంబంధించి.. నోటిఫికేషన్ జారీ చేసే రోజు నుంచే ఆ విడత ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలవుతుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి క్షేత్రస్థాయిలో అన్ని ఏర్పాట్లూ పూర్తిచేశామని.. ఎక్కడా అడ్డంకులు లేకుండా గ్రామపంచాయతీ ఎన్నికలను సమర్థంగా నిర్వహించేలా.. అన్ని జిల్లాల కలెక్టర్లతో సమన్వం చేసుకుంటామని ఎస్ఈసీ వెల్లడించారు.

### ఏయే విడతలో ఎన్నంటే..

రాష్ట్రవ్యాప్తంగా 12,728 సర్పంచు స్థానాలు, 1,12,288 వార్డులకుగాను.. తొలివిడతలో భాగంగా డిసెంబర్ 11న 4,236 సర్పంచ్, 37,440 వార్డుసభ్యుల స్థానాలకు.. రెండోవిడతలో భాగంగా డిసెంబరు 14న 4,333 సర్పంచ్, 33,350 వార్డుసభ్యుల స్థానాలకు.. మూడోవిడతలో భాగంగా 4,159 సర్పంచ్, 36,452 వార్డుసభ్యుల స్థానాలకు డిసెంబర్ 17న పోలింగ్ జరగనుంది. సర్పంచ్ ఎన్నికలకుగాను 15,522.. వార్డుసభ్యుల ఎన్నికకు సంబంధించి 1,12,474 పోలింగ్ స్టేషన్లను ఎన్నికల విభాగాలు ఎంపిక చేశాయి. ఈ ఎన్నికలను పార్టీరహితంగా చేపడతారన్న సంగతి తెలిసిందే. ఇందుకు అనుగుణంగానే రాష్ట్ర ఎన్నికల సంఘం.. ఎన్నికల సామగ్రిని ఇప్పటికే సిద్ధం చేసింది. గ్రామ పంచాయతీల పరిధిలో పోటీచేసే అభ్యర్థులకు కేటాయించాల్సిన గుర్తులను, బ్యాలెట్ పత్రాలను ఇప్పటికే ముద్రించింది. స్థానికంగా వచ్చే నామినేషన్ల ఆధారంగా ఆయా గుర్తులను అభ్యర్థులకు కేటాయించనున్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా రాష్ట్రంలోని 1,66,55,186 మంది గ్రామీణ ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషుల కన్నా మహిళలే ఎక్కువగా ఉన్నారు. మొత్తం ఓటర్లలో పురుషులు 81,52,231 మంది ఉండగా.. మహిళలు 85,12,455 మంది, ఇతరులు 500 మంది ఉన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) సిద్ధం చేసిన ఓటర్ల తుదిజాబితా ఆధారంగా.. గ్రామపంచాయతీ, వార్డులవారీగా డీపీవోలు, ఎంపీడీవోల ద్వారా పరిశీలన జరిపి.. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకోసం రాష్ట్ర ఎన్నికల సంఘం తాజాగా ఓటరు జాబితాను సిద్ధంచేసింది.

### 32 పంచాయతీలకు ఎన్నికల్లేవు

పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో అన్ని గ్రామాల్లో సందడి నెలకొంది. అయితే.. కొన్ని న్యాయపరమైన వివాదాల కారణంగా 32 పంచాయతీలకు ఈసారి ఎన్నికలను నిర్వహించడంలేదని ఎస్ఈసీ తెలిపింది. ములుగు జిల్లా మంగపేట మండలంలోని 25 గ్రామ పంచాయతీలకు, కరీంనగర్ జిల్లా వి.సైదాపూర్ మండలంలోని 2 గ్రామ పంచాయతీలకు, ఖమ్మంజిల్లా ఏన్కూరు మండలంలో 4 పంచాయతీలకు, అదే జిల్లాలోని పెనుబల్లి మండలంలో ఒక గ్రామ పంచాయతీకి ఎన్నికలు జరగడం లేదని ఎస్ఈసీ పేర్కొంది.

### ఇద్దరికంటే ఎక్కువ మంది పిల్లలున్నా..

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు ఇద్దరికంటే ఎక్కువమంది పిల్లలు ఉంటే అనర్హులు అనే విధానం చాలాకాలంగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. అయితే రాష్ట్రప్రభుత్వం జారీచేసిన జీవో ప్రకారం ఈసారి స్థానికసంస్థల ఎన్నికల్లో, ప్రస్తుతం చేపట్టే పంచాయతీ ఎన్నికల్లోనూ ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలున్నవారు సైతం పోటీచేసేందుకు అర్హులే. గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా ప్రభుత్వం ఖరారుచేసిన ఎస్టీ, ఎస్సీ, బీసీ రిజర్వేషన్లపై భిన్నాభిప్రాయం వ్యక్తమవుతోంది. రిజర్వేషన్ల ప్రక్రియపై ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా సర్పంచ్ స్థానాలకు సంబంధించి ఆర్‌డీవో, డీపీవోలు.. వార్డుసభ్యులకు సంబంధించి ఎంపీడీవోలు రిజర్వేషన్లను ఖరారుచేశారు. ఆయా జిల్లాల్లో జనాభాకు అనుగుణంగా.. బీసీ వర్గాలకు ఒక్కో చోట ఒక్కో విధంగా రిజర్వేషన్లు కల్పించినప్పటికీ.. బీసీలకు మొత్తంగా

# జీహెచ్ఎంసీ విస్తరణ

(మొదటి పేజీ తరువాయి)

ముగిసి చాలా కాలమైంది. అక్కడ ఎన్నికలు నిర్వహించకపోవటంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ప్రస్తుత జీహెచ్ఎంసీ పాలకమండలి గడువు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ముగుస్తుంది. జీహెచ్ఎంసీలో 27 మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల విలీన ప్రతిపాదనపై అధ్యయనం చేసి నివేదికతో కూడిన అభిప్రాయం చెప్పేందుకు బల్దియా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మంత్రివర్గం నిర్ణయం నేపథ్యంలో విలీన ప్రతిపాదనను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌మంగళవారం కౌన్సిల్ ముందు ఉంచారు. జీహెచ్ఎంసీ చట్టం 1955 ప్రకారం విలీన ప్రతిపాదనపై అవసరమైన అధ్యయనం చేసి అభిప్రాయం తెలపాలని ఈ నెల 21న సర్కారు బల్దియాకు మెమో పంపింది. దీంతో టేబుల్ ఎజెండాగా ఈ అంశాన్ని కౌన్సిల్‌లో ప్రస్తావించగా మెజార్టీ సభ్యులు ఆమోదించారు. విలీన ప్రతిపాదనపై ఎంఐఎం అభ్యంతరం వ్యక్తం చేసింది. అయితే, సర్కారు నిర్ణయంపై అభ్యంతరం తెలపడం సబబు కాదంటూ.. అభిప్రాయం చెప్పాలన్న ప్రతిపాదనను ఆమోదిస్తున్నట్టు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రకటించారు. జీహెచ్ఎంసీ పాలక మండలి గడువు ముగిసిన తర్వాతే విలీనం జరుగుతుందని ఓ అధికారి తెలిపారు. విలీనం అనంతరం మొత్తం ప్రాంతాన్ని విభజించే అవకాశం ఉందని ఓ అధికారి తెలిపారు. సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. డివిజన్ల పునర్విభజన, కార్పొరేషన్ల విభజన ఒకటి రెండు నెలల్లో పూర్తవుతుందని చెప్పారు. జీహెచ్ఎంసీలో విలీనం కానున్న మునిసిపాలిటీల్లో శంషాబాద్, నార్సింగి, మేడ్చల్ పరిధి ఓఆర్‌ఆర్‌కు బయట 2–3 కి.మీ దూరం వరకు విస్తరించి ఉంది. ఇవి ఓఆర్‌ఆర్ గ్రోత్ కారిడార్‌లో ఉండడంతో అక్కడ పట్టణీకరణ శరవేగంగా జరుగుతోంది. మిగతా ప్రాంతాల్లో ఇంత వేగంగా పట్టణీకరణ లేదు. పైగా ఈ మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో అభివృద్ధి, పట్టణ ప్రణాళికలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. పెరుగుతున్న పట్టణీకరణ ఒత్తిడిని, వనరుల పంపిణీలో అసమానతల వల్ల మౌలిక వసతుల కల్పనలో ప్రాంతాల మధ్య సమతుల్యత లోపించటాన్ని ప్రభుత్వం గుర్తించింది. మెట్రోపాలిటన్ ప్రాంతంలో ఒకేతరహా అభివృద్ధి ప్రణాళికను అమలు చేసేదిశగా విలీన నిర్ణయం తీసుకుంది. అన్ని ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడం, అస్తవ్యవస్త కాలనీల ఏర్పాటును నిలువరించడం, జనాభా ఒత్తిడిని అధిగమించడం, విపత్తుల నిర్వహణను సులభతరం చేయడం, అన్ని ప్రాంతాలకు పెట్టుబడులు వచ్చేలా ప్రణాళికలు తయారు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఓఆర్‌ఆర్ వరకు మెట్రోపాలిటన్ ప్రణాళికలను అమలుచేసే దిశగా విలీన ప్రక్రియను చేపట్టినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఈ నెల 21న జారీచేసిన మెమోలో తెలిపారు. జీహెచ్ఎంసీ విస్తరణతో ఓఆర్‌ఆర్ అవతలి ప్రాంతాలకు కూడా హైదరాబాద్ ప్రధాన కేంద్రంలో ఉన్న సౌకర్యాలు లభించనున్నాయి. తాగునీటి నిర్వహణలో వాటర్‌బోర్డు ప్రస్తుతం ఔటర్ లోపలి ప్రాంతాల్లో ముఖ్య భూమిక పోషిస్తోంది. ఇకపై ఓఆర్‌ఆర్ అవతల ఉన్న కొన్ని ప్రాంతాలకు కూడా ఈ సేవలు అందుబాటులోకి వస్తాయి. ఈ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, ఇతర పనులను జీహెచ్ఎంసీ చూసుకోనుంది. విలీనం కానున్న 27 మునిసిపాలిటీ ఉద్యోగులు జీహెచ్ఎంసీ పరిధిలోకి రానుండటంతో వారి జీతభత్యాలు కూడా జీహెచ్ఎంసీనే చెల్లిస్తుంది. ప్రస్తుతం జీహెచ్ఎంసీలోని పారిశుద్ధ్య సిబ్బందికి ఇస్తున్నట్లుగానే విలీన ప్రాంతాల సిబ్బందికి కూడా వేతనాలు ఇస్తారు.

# తెలంగాణలో మొదలవుతున్న పంచాయతీ !

పంచాయతీ ఎన్నికలే లక్ష్యంగా అధికార పార్టీల పావులు కదుపుతోంది. రెండుమూడు రోజుల్లో నోటిఫికేషన్ వస్తుందని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కొడంగల్ సభలో స్వయంగా ప్రకటించారు. ఇప్పటికే ఇందిరమ్మ చీరల పంపిణీ మొదలయ్యింది. ఊరూవాడా ఈ జాతర సాగుతోంది. మంగళవారం నుంచి మహిళలకు వడ్డీరహిత రుణాల జాతర మొదలయ్యింది. నియోజకవర్గాల వారీగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ పనిలో పడ్డారు. ఇందిరమ్మ ఇళ్ల వ్యవహారం మరోవైపు సాగుతోంది. ఇదంతా కేవలం పంచాయితీ ఎన్నికల కోసమే అని వేరుగా చెప్పనక్కరలేదు. ఈ క్రమంలో బిసి రిజర్వేషన్లు వెనక్కి పోయాయి. పార్టీపరంగా 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించారు. ఉరిమురిమి మంగళం మీద పడ్డట్లు రిజర్వేషన్లు అమలు కాకపోవ డానికి బిజెపి కారణమని తప్పించుకోజూస్తున్నారు. 42శాతం రిజర్వేషన్ల హామీ కాంగ్రెస్ పార్టీ ఇచ్చింది. దానిని ఎలా అమలు చేస్తారో కూడా తెలియకుండా నానా రకాల ఫీట్లు చేసి, చివరకు కోర్టుల్లో భంగపాటుకు గురయ్యారు. కేంద్రం ఆమోదించకపోవడం వల్లనే ఇలా జరిగిందని సాకులు చూపారు. నిజంగానే రిజర్వేషన్ల వ్యవహారం ఎలా ఉంటుందో తెలియంది కాదు. 50 శాతానకు మించి రిజర్వేషన్లు అమలు చేయడం కుదరదు. దీనికి నిబంధనలు ఉన్నాయి. అవన్నీ పక్కన పెట్టి లాయర్లకు, కోర్టులకు డబ్బులు తగలేసి, చివరకు ఎన్నికలు ఆసల్యంగా జరపడానికి సిద్ధం అయ్యారు. అదికూడా నిధులు రాకపోతే ఎలా అన్న మీమాంసలో ముందుకు వెళ్లడం తప్ప చిత్తశుద్దితో కాదు. పంచాయితీల పాలన ముగిసి దాదాపు రెండేళ్లు కావస్తోంది. ఈ క్రమంలో బిసి రిజర్వేషన్ల పేరిట నానా హంగామా చేసి, ఇప్పుడు మళ్లీ పాతపద్దతి లోనే పంచాయితీ ఎన్నికలకు సిద్ధం అయ్యారు. మొత్తంగా ఇదంతా ఊహించినట్టే జరిగింది. 42 శాతం కోటా పేరిట ఊదరగొట్టి.. చివరికి పాత పద్ధతిలో 25 శాతానికి బీసీ కోటాను పరిమితం చేసి ఎన్నికలకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది. ఇకపోతే బిసి కులగణన పేరుతోనూ నానా విధాలుగా వక్రీకరణలు జరిగాయి. అసలు సర్వే సంపూర్ణంగా సాగలేదు. 1948 చట్టం ప్రకారం జనాభా గణన చేపట్టే అధికారం కేంద్రానికి మాత్రమే ఉన్నది. ఎలాంటి జనగణన నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలు లేవు. ఒకవేళ చేసినా ఆ గణాంకాలకు చట్టబద్ధత ఉండకపోవడమేగాక, అమలు చేసే అవకాశం కూడా లేదు. మరోవైపు, కేంద్ర ప్రభుత్వమే గణాంకాల సేకరణ చట్టం-2008 ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలకు డాటా సేకరణకు కొన్ని పరిమిత అధికారాలను బదలాయించింది. ఒకవేళ రాష్ట్రం నిర్వహించాలని భావించినా అందుకు కేంద్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. అంతేకాదు, సేకరించిన డాటా వెల్లడిపై కూడా అనేక ఆంక్షలను విధించింది. రాష్ట్ర ప్రభుత్వం పేరుకు ఇంటింటి సర్వే అని చెప్పి రాష్ట్రవ్యాప్తంగా జనాభాగణననే నిర్వహించి అందరినీ మభ్యపెట్టిందని విపక్షాలు ఇప్పటికే ఆరోపించాయి. కేంద్రం సర్వేకు అంగీకరించడంతో అదీ తమ ఘనతే అని చెప్పు కున్నారు. కేంద్రం మెడలు వంచామని బుకాయించారు. రాహుల్ నామ జపంతో సమస్యలు పక్కదారి పట్టిస్తున్నారు. మొత్తంగా ఇప్పుడు గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాల రిజర్వేషన్ల ఖరారులో పూర్తి గందరగోళం నెలకొన్నది. సర్కారు జారీచేసిన మార్గదర్శ కాలకు విరుద్ధంగా జిల్లాల్లో ఎక్కడికక్కడ అధికారులు ఇష్టారీతిన రిజర్వేషన్లను ఖరారు చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. తొలిదశలో నోటిఫికేషన్ జారీ చేసినప్పుడు ఎస్సీ, ఎస్టీలు ఒక్కరూ లేనిచోట కూడా ఆ వర్గాలకు స్థానాలను రిజర్వ్ చేయడం, పూర్తిగా ఎస్టీలే ఉన్నచోట ఇతర వర్గాలకు రిజర్వ్ చేయడం చూశాం. ఇప్పుడు కూడా అలాంటి విమర్శలే వస్తున్నాయి. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి 50 శాతానికి మించకుండా ఎస్టీ, ఎస్సీ, బీసీలకు రిజర్వేషన్లు ఖరారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల

జీవో-46ను విడుదల చేసింది. సర్పంచ్ స్థానాలకు ఆర్డీవోలు, వార్డు మెంబర్ల స్థానాలకు ఎంపీడీవోలు రిజర్వేషన్లను ఖరారు చేయాల్సి ఉన్నది. రిజర్వేషన్లను ఏప్రాతిపదికగా నిర్ణయించాలో సర్కారు మార్గదర్శ కాల్లో పేర్కొన్నది. జనాభా దామాషా ప్రకారం తొలుత ఎస్టీ, ఎస్సీ, బీసీ, తదుపరి మహిళా స్థానాలను ఖరారు చేయాల్సి ఉన్నది. ఆయా స్థానాలకు అనుగుణంగా గ్రామం, మండలం, జిల్లా, ఆపై రాష్ట్రం యూనిట్‌గా నిర్దేశిత కోటా ప్రకారం స్థానాలను రిజర్వ్ చేయాల్సి ఉంటుంది. సగం కంటే ఎక్కువ ఏ జనాభా ఉంటే ఆ వర్గానికి మొదటి ప్రాధాన్యంగా స్థానాలను రిజర్వ్ చేస్తూ వెళ్తుంటారు. ఇదీ ఆయా స్థానాల రిజర్వేషన్లకు అనుసరించే ప్రక్రియ. ఎప్పుడూ ఇదే పద్దతిని అవలంబిస్తున్నారు. షెడ్యూల్డ్ ఏరియాలోనూ ఎస్టీలకు మొత్తం స్థానాల్లో సగానికి తగ్గకుండా ఉండాలి. వందశాతం ఎస్టీ జనాభా ఉన్నచోట మొత్తంగా వారికే కేటాయించాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే వార్డు మెంబర్ స్థానాలకు ఇంటింటి సర్వే-2024 లెక్కలను, సర్పంచ్ స్థానాలకు 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకొని ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు ఖరారు చేయాలని, ఇంటింటి సర్వే-2024 లెక్కలను పరిగణనలోకి తీసుకుని బీసీలకు రిజర్వేషన్లు ఖరారు చేయాలని ఆదేశించడం చర్చనీయాంశంగా మారింది.

దీంతో రిజర్వేషన్ల కేటాయింపు మొత్తంగా గందర గోళంగా మారిందని తెలుస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా సీట్లను అలాట్ చేశారనే విమర్శలొస్తున్నాయి. అనేకచోట్ల గందరగోళంగా జరిగిందంటూ ఆశావహులు ఇప్పటికే అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారు.

ఃజర్వేషన్లలో బీసీలకు తీరని అన్యాయం జరుగుతున్నదని బీసీ సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే పలు జిల్లాల్లో సర్పంచ్, వార్డుమెంబర్ స్థానాలకు రిజర్వేషన్లను ఖరారు చేశారు. అన్ని జిల్లాల్లో బీసీ కోటాను తగ్గించి జనరల్ కోటను పెంచారని బీసీ సంఘాలు చెప్తున్నాయి. రొటేషన్ ముసుగులో బీసీలకు రావాల్సిన సర్పంచ్ స్థానాలను అగ్రకులాలకు కట్టబెడుతున్నారని మండిపడుతున్నాయి.

మొత్తంగా ఇప్పుడు వస్తున్న విమర్శలు, ఆందోళనలకు ప్రభుత్వం సమాధానం ఇచ్చుకోవాలి. అలాగే పారదర్శకంగా రిజర్వేషన్ల అమలు, ఎన్నికల నిర్వహణ జరగాలి. అప్పుడే ప్రభుత్వ నిజాయితీ కనిపిస్తుంది.

# రిజర్వేషన్లలో బిసిలకు న్యాయం దక్కేనా

### పంచాయితీల్లో బిసిల కోటాపై సర్వత్రా అనుమానాలు

### పలుచోట్ల తప్పల తడకగా సాగిందంటూ నిరసనలు

**హైదరాబాద్,నవంబర్25(నేటి ఫోకస్ న్యూస్):**

పంచాయితీ ఎన్నికలుకు సంబంధించి బిసి రిజర్వేషన్ల కేటాయింపులో గందరగోళం నెలకొన్నదని పలు బిసి సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీసీ కోటా గతం కంటే తగ్గిపోయింది. అన్ని జిల్లాల వివరాలను సేకరించి త్వరలోనే సీఎస్‌ను కలిసి ఫిర్యాదుచేస్తాం అని అంటున్నారు. న్యాయం చేయకుంటే కోర్టుల ద్వారా పోరాటం చేసేందుకైనా సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీలోని బీసీ మంత్రులు, ప్రజాప్రతినిధులు ఈ అన్యాయంపై తక్షణం స్పందించాలని వారు కోరుతున్నారు. కోటా తగ్గింపునకు వ్యతిరేకంగా 30న చలో హైదరాబాద్ నిర్వహిస్తాం అని జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. చాలా జిల్లాల్లో గతంలో కంటే బీసీ కోటా తగ్గిపోయినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయన్నారు. 42 శాతం రిజర్వేషన్లు దేవుడెరుగు కనీసం ఇప్పటికే ఉన్న బీసీ రిజర్వేషన్లకే రాష్ట్ర ప్రభుత్వం గండి కొడుతున్నదని మండిపడ్డారు. వాస్తవంగా 2019లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 18శాతం నుంచి 22.79 వరకు రిజర్వ్ అయ్యాయి.కానీ, ప్రస్తుతం రాష్ట్రంలో అనేక కొత్త పంచాయతీలు ఏర్పడినప్పటికీ,

ప్రస్తుతం బీసీలకు 16 నుంచి 20 శాతానికి మించి రిజర్వేషన్లు దక్కడంలేదని వివరిస్తున్నారు. అనేక డివిజన్లు, మండలాల్లో బీసీలకు ఒకటి కూడా సర్పంచ్ సీటు రిజర్వు కాలేదని, గత ఎన్నికల్లో కంటే కనీసం రెండు మూడు స్థానాల వరకు బీసీ కోటాను తగ్గించారని ఆందోళన వ్యక్తం చేసారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల ఖరారు చేసేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేస్తూ జీవో-46 విడుదల చేసింది. సర్పంచ్ స్థానాలకు 2011 జనాభా లెక్కలను, వార్డు మెంబర్ స్థానాలకు 2024 ఇంటింటి సర్వే లెక్కలను పరిగణన లోకి తీసుకోవాలని స్పష్టంచేసింది. అయితే, రాష్ట్రాలు నిర్వహించిన కులగణన సర్వేలకు చట్టబద్ధత లేదని, పారదర్శకత ఉండబోదని, ఆ సర్వే గణాంకాలు చెల్లబోవని కేంద్రం ఇప్పటికే అనేకసార్లు స్పష్టంచేసింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఇంటింటి సర్వే గణాంకాలను ప్రామాణికంగా తీసుకోవాలని చెప్పడం చర్చనీయాంశంగా మారింది. జనాభాగణన అంశం 7వ షెడ్యూల్‌లో కేంద్ర జాబితాలోని అంశం. గణాంకాల సేకరణ చట్టం-2008 ప్రకారం సర్వే నిర్వహించాలన్నా కొన్ని నిబంధనలను పాటించాల్సి ఉన్నది. స్వయం ప్రతిపత్తి కలిగిన కమిషన్‌ను ఏర్పాటు చేయడంతోపాటు గణాంకాల సేకరణకు ఒక ప్రభుత్వ శాఖను నోడల్ డిపార్ట్‌మెంట్‌గా నియమించాలి. నేషనల్ ప్లానింగ్ అండ్ ఇంప్లిమెంటేషన్ డిపార్ట్‌మెంట్, స్టాటిస్టిక్స్ డిపార్ట్‌మెంట్, ఎన్ఎస్ఎస్‌వో తదితర విభాగాల నుంచి రాష్ట్రానికి చెందిన తాజా ఇండ్ల జాబితాను, బ్లాక్‌వారీ గా రూపొందించిన హౌసింగ్ మ్యాపులను కూడా తీసుకోవాల్సి ఉంటుంది. ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలకు సంబంధించిన స్థితిగతులను తులనాత్మక అధ్యయనం చేయాల్సి ఉంటుంది. తుదకు అన్నింటినీ క్రోడీకరించి, విశ్లేషించి తుదకు కేంద్రం ఆమోదంతో ఆ గణాంకాలను ప్రామాణికంగా పరిగణనలోకి తీసుకునే అవకాశముంటుంది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రూ.160 కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో 2024 నవంబర్‌లో ఇంటింటి సర్వే నిర్వహించింది. రాష్ట్రంలో మొత్తంగా 3.7 కోట్ల మంది జనాభా ఉండగా, అందులో 96.9శాతం మందిని సర్వే చేసి వివరాలను సేకరించిందని అంటున్నారు. ఆ లెక్కనే 100 శాతం కరెక్టని కాంగ్రెస్ చెప్పుకుం టోందని అంటున్నారు. అయితే స్థూలంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనారిటీ వర్గాల గణాంకాలనే బయటపెట్టింది. కులాలు, ఉపకులాల వారీగా వివరాలను మాత్రం గోప్యంగా దాచిపెట్టింది. పూర్తిస్థాయి నివేదికను వెల్లడించకపోవడం, అభ్యంతరాలను స్వీకరించకపోవడంతో సర్వే గణాంకాలకు సాధికారత లేకుండా పోయిందని పలు బిసి నేతలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. కానీ, తాజాగా ఆ గణాంకాలనే ప్రామాణికంగా తీసుకుని స్థానిక రిజర్వేషన్లు ఖరారు చేయాలని మార్గదర్శకాలు జారీచేయడంపై చర్చ కొనసాగుతున్నది.

కులగణన అంశం పూర్తిగా కేంద్రం పరిధిలోనిదేనని కేంద్రం గతంలోనే స్పష్టంచేసింది. దేశవ్యాప్తంగా చేపట్టబోయే జనాభా గణనలో కులగణనను కూడా నిర్వహించా లని ఆ కమిటీ నిర్ణయించింది. అందుకు సంబంధించి షెడ్యూల్ ను కూడా ఇప్పటికే ప్రకటించింది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 2024 ఇంటింటి సర్వే గణాంకాలను ప్రామాణికంగా తీసుకోవడం ఇప్పుడు అనేక వివాదాలకు తావిస్తున్నది. ఈ క్రమంలో యా స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్ల రొటేషన్ ప్రక్రియను సైతం నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించారనే ఆరోపణలొస్తున్నాయి. 2019కి ముందు ఏర్పడిన పంచాయతీలు, మండలాలు, జిల్లాలకు మాత్రమే రొటేషన్ వర్తిస్తుంది. 2019 తరువాత ఏర్పడిన నూతన పంచాయితీలు, మండలాలు, జిల్లాలకు రొటేషన్ వర్తించదు. మొదటినుంచి రోస్టర్‌ను తీసుకోవాల్సి ఉంటుంది. రొటేషన్ ఎలా చేయాలంటే తొలుత ఎస్టీ జనరల్, మహిళలు, ఎస్సీ జనరల్, ఎస్సీ మహిళలు, బీసీ జనరల్, బీసీ మహిళలు, జనరల్ స్థానాలుగా మార్చాలి. ఈ రొటేషన్ క్రమాన్ని కూడా పాటించలేదని తెలుస్తున్నది. అంతేకాకుండా, కొన్ని స్థానాలకు 2011

జనాభాల లెక్కలను, మరికొన్ని స్థానాలకు 2024 ఇంటింటి సర్వే జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవడం కూడా గందరగోళానికి దారితీసిందని పలువురు వివరిస్తున్నారు. కొన్ని స్థానాల రిజర్వేషన్‌ను మార్పు చేయకుండా యథాతథంగా కొనసాగించారని అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రొటేషన్ క్రమం వల్ల ఎక్కువగా బీసీలకు అన్యాయం జరిగిందనే విమర్శలున్నాయి.

# సింగర్ జుబీన్ గార్గ్‌ది ముమ్మాటికీ హత్యే

### అసెంబ్లీలో అసోం సిఎం బిస్వశర్మ వ్యాఖ్య

**గౌహతి,నవంబర్25(నేటి ఫోకస్ న్యూస్):**

ప్రముఖ సింగర్ జుబీన్ గార్గ్ మరణంపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ సంచలన వ్యాఖ్యలు చేశారు. జుబీన్ గార్గ్ ప్రమాదవశాత్తూ చనిపోలేదని.. అతడిని హత్య చేశారంటూ అసెంబ్లీ వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో కూడా ఆయన మీడియా ముందు ఈ తరహా వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ సారి శాసన సభ వేదికగా జుబీన్ మరణంపై సీఎం హిమంత ఈ సంచలన కామెంట్స్ చేయడం సర్వత్ర చర్చనీయాంశంగా మారింది. మంగళవారం అస్సాం అసెంబ్లీలో గార్గ్ మరణం గురించి చర్చించడానికి ప్రతిపక్షాలు వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. ఈ సందర్భంగా సీఎం హిమంత బిస్వా శర్మ మాట్లాడుతూ.. జుబీన్ గార్గ్ ది ప్రమాదం కాదని, ఆయన్ను చంపేశారని ఆరోపించారు. మరోవైపు గార్గ్ మరణంపై దర్యాప్తు చేస్తున్న ఏకసభ్య కమిషన్ వాంగ్మూలాలు నమోదు చేయడానికి, సాక్ష్యాలను సమర్పించడానికి గడువును డిసెంబర్ 12 వరకు పొడిగించింది. గౌహతి హైకోర్టు సిట్టింగ్ జడ్జి జస్టిస్ సౌమిత్ర సైకియా నేతృత్వంలోని కమిషన్ నవంబర్ 3 నుంచి విచారణను ప్రారంభించింది. దీనికి సంబంధించిన నివేదికను సమర్పించే గడువు నవంబర్ 21తో ముగిసింది. దీంతో గడువును డిసెంబర్ 12 వరకు పొడిగిస్తూ ఏకసభ్య కమిషన్ సోమవారం నిర్ణయం తీసుకుంది. గార్గ్ మరణంపై అసలు విషయాలు తెలుసుకునేందుకు అస్సాం ప్రభుత్వం ఈ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ప్రముఖ సింగర్ జుబీన్ గార్గ్ సెప్టెంబర్ 19న మరణించిన విషయం తెలిసిందే. సింగపూర్ వెళ్లిన జుబీన్ అక్కడ ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయారు. అయితే, ఆయన మరణంపై పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో సీఎం హిమంత బిశ్వ శర్మ ఆదేశాల మేరకు జుబీన్ మృతిపై ఏకసభ్య కమిషన్ దర్యాప్తు ముమ్మరం చేసింది.

# నెతన్యాహు భారత పర్యటన రద్దు

### ఇటీవలి ఢిల్లీ పేలుళ్లతో నిర్ణయం

**న్యూఢిల్లీ,నవంబర్25(నేటి ఫోకస్ న్యూస్):**

ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు భారత్ పర్యటన మరోసారి రద్దయింది. ఇటీవల ఢిల్లీ ఎర్రకోట పేలుళ్లతో దేశంలో భద్రతా పరిస్థితులు సున్నితంగా మారిన నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ ఏడాది నెతన్యాహు పర్యటన రద్దవడం ఇది మూడో సందర్భం కావడం విశేషం. నెతన్యాహు ఈ సంవత్సరం చివరిలో భారత్‌ను సందర్శించాలని ప్రాథమికంగా నిర్ణయించినప్పటికీ, ఎర్రకోట బాంబు దాడి నేపథ్యంలో ఆయన షెడ్యూల్‌లో మార్పు చేశారు. అంతకుముందు సెప్టెంబర్ 19 న జరగాల్సిన ఒక రోజు పర్యటనను కూడా రద్దు చేసిన సంగతి విదితమే. అదేవిధంగా ఈ ఏడాది ఏప్రిల్‌లో ముందుగా నిర్ణయించిన పర్యటన కూడా వాయిదా పడింది. బెంజమిన్ నెతన్యాహు భారత్‌కు చివరిసారిగా 2018లో వచ్చారు. అయితే 2026లో నెతన్యాహు భారత్‌కు

చేరుకొని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో భేటీ అయ్యే అవకాశం ఉందని సమాచారం. ఢిల్లీ ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు విస్ఫోటంలో 13 మంది మరణించగా, అనేక మంది గాయపడిన విషయం ఇప్పటికే వెలుగులోకి వచ్చింది.

# ఢాకాకు హసీనా అప్పగింత భారత నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి

**ఢాకా,నవంబర్25(నేటి ఫోకస్ న్యూస్):**



తమ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా, మాజీ హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్‌ను తమకు అప్పగించాలని కోరుతు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం భారత్‌కు లేఖ పంపింది. ఈ క్రమంలో భారత్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది సర్వత్రా ఆసక్తిగా మారింది. ప్రపంచదేశాలు కూడా దీనిపై ఆసక్తిని కనబరుస్తున్నాయి. ఈ విషయాన్ని ఆ దేశ ప్రభుత్వ విదేశాంగ శాఖ సలహాదారు తౌహిద్ హుస్సేన్ వెల్లడించారు. బంగ్లాదేశ్‌లో అల్లర్ల నేపథ్యంలో హసీనా భారత్‌లో తలదాచుకుంటున్న సంగతి తెలిసిందే. హసీనా పదవీకాలంలో అనేక మంది రాజకీయ కార్యకర్తలు, విమర్శకులు అదృశ్యమయ్యారనే కేసులో బంగ్లాదేశ్‌లోని అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ (ఐసిటి) ఆమెకు మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే. ఈ తీర్పు అమలులో భాగంగా భారత్‌కు బంగ్లాదేశ్ ఈ లేఖ పంపినట్లు హుస్సేన్ తెలిపారు. తీర్పు వివరాలు ఉన్న లేఖను కూడా భారత్‌కు పంపినట్లు ఆయన వెల్లడించారు. అసదుజ్జమాన్‌ను కూడా మరణ శిక్ష విధించినయ విషయాన్ని కూడా భారత్‌కు తెలిపామన్నారు.. 'ఈ ఇద్దర్నీ ఆలస్యం చేయకుండా బంగ్లాదేశ్ అధికారులకు అప్పగించాలని మేము భారత ప్రభుత్వాన్ని కోరుతున్నాము. ఇరుదేశాల మధ్య ఉన్న అప్పగింతల ఒప్పందం ప్రకారం ఇది భారతదేశంపై కూడా ఒక బాధ్యత' అని లేఖలో బంగ్లాదేశ్ పేర్కొంది. అయితే ఈ లేఖపై న్యూఢిల్లీలోని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇంకా స్పందించాల్సి ఉంది. కాగా ఐటిసి తీర్పును 'గమనించాము' అని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ గతంలో వ్యాఖ్యానించింది.



# జిహెచ్ఎంసి సమావేశంలో గందరగోళం

### వందేమాతరం గీతానికి అవమానం

### సీట్లలోంచి లేవని..ఎంఐఎం సభ్యులు

### బిజెపి అభ్యంతరంతో తీవ్ర వాదోపవాదాలు

**హైదరాబాద్,నవంబర్25(నేటి ఫోకస్ న్యూస్):**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో మంగళవారం తీవ్ర గందర గోళం నెలకొంది. వందేమాతరం, జయ జయహే తెలంగాణ గీతాల ఆలాపన సమయంలో మజ్లిస్ కార్పొరేటర్లు కుర్చీలో నుంచి లేవలేదు. దీంతో బీజేపీ కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. వందేమాతర గీతం పాడితేనే దేశంలో ఉండాలంటూ వారు బిగ్గరగా నినాదాలు చేశారు. దాంతో బీజేపీకి వ్యతిరేకంగా ఎంఐఎం కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు. ఇరు పార్టీల కార్పొరేటర్లు.. ఈ

సమావేశంలో టేబుల్స్ ఎక్కి హంగామా చేశారు. దాంతో మార్షల్స్ రంగంలోకి దిగి.. వారిని బయటకు తీసుకు వెళ్లే ప్రయత్నం చేశారు. సభ సజావుగా జరిగేలా సహకరించాలంటూ కాంగ్రెస్ పార్టీ సభ్యులు ఈ రెండు పార్టీల కార్పొరేటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ రోజు జరుగుతున్న జీహెచ్ఎంసీ పాలక మండలి తుది సమావేశం. మరో రెండున్నర నెలల్లో ప్రస్తుత పాలక వర్గం గడువు ముగియనుంది. ఈ సమావేశంలో 95 ప్రశ్నలు, 45 అజెండ అంశాలపై చర్చించాల్సి ఉంది. ఈ తుది సమావేశానికి జీహెచ్ఎంసీ కార్పొరేటర్లతోపాటు సిటీలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ క్రమంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం ప్రారంభానికి ముందై రభస మొదలైంది. పారిశ్రామిక వాడల భూములను అమ్మేలా రూపొందించిన పాలసీని రద్దు చేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు నిరసన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ కార్యాలయానికి నిరసన తెలుపుతూ ర్యాలీగా వెళ్లారు. రూ.5 లక్షల కోట్ల విలువైన 9,292 ఎకరాల భూములను అమ్మేస్తూ.. రేవంత్ రెడ్డి సర్కార్ దేశంలోనే అతిపెద్ద స్కామ్‌కు తెరలేపిందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని ఇండస్ట్రియల్ కారిడార్ భూములను అమ్ముతున్న పాలసీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

**మంచిర్యాల,నవంబర్25(నేటి ఫోకస్ న్యూస్):**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాలలో గల టీ కన్వెన్షన్ హాల్ ఎదురుగా ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన కుంబాల రాజేష్ (32) అనే వ్యక్తి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం వారు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేష్ తన భార్య మౌనిక కూతురు అద్విక, కుమారుడు మణివర్షిత్ లతో కలిసి ద్విచక్రవాహనం పై లక్షెటిపేటలో జరిగిన ఓ వివాహానికి హాజరై తిరిగి వస్తున్న క్రమంలో పాత మంచిర్యాలకు రాగానే ఎదురుగా వస్తున్న గుడిపేటకు చెందిన దుర్గం సంతోష్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంతో బలంగా ఢీ కొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్రగాయలపాలైన రాజేష్, తన కూతురు అద్వికలను మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకి తరలించి చికిత్స అందించారు. వైద్యుల సూచనమేరకు మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స ను అందించినట్లు పేర్కొన్నారు. కాగా చికిత్స పొందుతూ మంగళవారం రాజేశ్ ఉదయం మృతి చెందినట్లు వివరించారు.

# మహిళలను అర్థికంగా బలోపేతమే లక్ష్యం

### పెగడపల్లిలో వడ్డీలేని రుణాలు పంపిణీ చేసిన మంత్రి

**జగిత్యాల,నవంబర్25(నేటి ఫోకస్ న్యూస్):**

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద మండలంలోని మహిళా సంఘ సభ్యులకు రూ.2కోట్ల 19 లక్షల 95 వేల 800 వడ్డీ లేని రుణాలను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు వ్యాపారంలో రాణించేందుకు గాను వారికి ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ ఎ÷-లాంట్లను ప్రభుత్వం కేటాయిస్తోందన్నారు. దీనికి తోడు వ్యాపారాలు చేసుకునేందుకు రుణాలు కూడా అందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూధన్ గౌడ్, డీఆర్డీవో రఘువరన్, ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములుగౌడ్, తహసీల్దార్ ఆనంద కుమార్, ఎంపీడీవో ప్రేమ్ సాగర్, ఆరఖ శ్రీనివాస్, ఏపీఎంలు రవివర్మ, రమాదేవి, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, సీసీలు స్వామి, తిరుపతి, శశికుమార్, మండల సమాఖ్య సభ్యులు కవిత, రూపకళ తదితరులున్నారు.

# 16 నెలల్లోనే 3 లక్షలకు పైగా ఇళ్ళు పూర్తి

### ఉగాదిలోగా మరో అయిదు లక్షల ఇళ్లు పూర్తి చేస్తాం

### మంత్రి కొలుసు పార్ధసారథి వెల్లడి

**అమరావతి,నవంబర్25(నేటి ఫోకస్ న్యూస్):**

16 నెలల్లోనే 3 లక్షలకు పైగా ఇళ్ళు పూర్తి చేసినట్లు మంత్రి కొలుసు పార్ధసారథి వెల్లడించారు. మరో అయిదు లక్షల ఇళ్లు ఉగాదిలోగా పూర్తి చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇంత వరకు ప్రారంభం కాని ఇళ్లు 3 లక్షల 30 వేల ఇళ్లు ఉన్నాయని వివరించారు. 15.59 లక్షల ఇళ్లు ఈ అయిదేళ్ళలో ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వమనే స్ఫూర్తితో సీఎం, మంత్రులు పనిచేస్తున్నామని మంత్రి కొలుసు పార్ధసారథి తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. టెక్నాలజీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో ముందుంటున్నామన్నారు.గృహనిర్మాణ శాఖ విషయంలో మూడు లక్షల ఇళ్లు పూర్తి చేసిన సందర్భంగా కీ హ్యాండోవర్ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఆ కార్యక్రమాన్ని కూడా వైసీపీ వివాదం చేసిందని మండిపడ్డారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 8 లక్షల 627 ఇళ్లు పూర్తయ్యాయని గుర్తుచేశారు. అలాగే జగన్ సీఎంగా ఉన్నప్పుడు కేవలం 6 లక్షలు మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. హౌసింగ్ ఫర్ ఆల్ అని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రివ్యూలో ముఖ్యమంత్రి చెప్పారన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి గృహప్రవేశం చేయిస్తామని చెప్పారు. ఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహించేందుకు కామన్ వాల్‌తో కలిపి కట్టుకోవడానికి జీవో ఇస్తామన్నారు. 8 లక్షల ఇళ్లు శాంక్షన్ అయితే 30 శాతం మాత్రమే పూర్తి చేశారని గత ప్రభుత్వంపై మండిపడ్డారు. గత వైసీపీ హయాంలో ఆప్షన్ 3 కింద ప్రభుత్వమే ఇళ్లు నిర్మించే స్కీంలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కాంట్రాక్ట్ తీసుకున్న రాక్రీట్ నిర్మాణ సంస్థ.. స్కీంకు తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. 47 వేల 850 ఇళ్లు తీసుకుని నిర్మిస్తామని చెప్పి ఎక్కడా పూర్తి చేయలేదన్నారు. 80 కోట్ల రూపాయలు అవకతవకలు చేశారని విజిలెన్స్ విచారణలో తేలిందన్నారు. రాక్రీట్ సంస్థపై క్రిమినల్, సివిల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ఇప్పటికైనా ఆప్షన్ 3లో పేమెంట్ కింద చివరి దశలో ఉన్న నిర్మాణాలు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని మంత్రి కొలుసు పార్ధసారథి వెల్లడించారు.






# ప్రభాస్ ఇమేజ్‌కు తగ్గట్లుగా రాజాసాబ్

ప్రభాస్ అభిమానులు తనపై పెట్టుకున్న నమ్మకానికి మించి 'ది రాజాసాబ్' ఉంటుందని దర్శకుడు మారుతి అన్నారు. ప్రభాస్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ది రాజాసాబ్'. తాజాగా ఈ సినిమా నుంచి 'రెబల్ సాబ్' అనే పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ.. ఈ చిత్రం విడుదలైన రోజు థియేటర్లు కేరింతలతో మార్మోగిపోవడం ఖాయమన్నారు. అందుకు తనదే హామీ అని చెప్పారు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ది కుమార్ హీరోయిన్లుగా కనిపించనున్న ఈ చిత్రం జనవరి 9న విడుదల కానుంది. ప్రభాస్ కథానాయకుడిగా మారుతీ దర్శకత్వంలో రూపొందుతున్న రొమాంటిక్ కామెడీ హారర్ ఫిల్మ్ 'ది రాజా సాబ్' సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ఒక్కో అప్‌డేట్ ఇస్తోంది. ఈ సినిమా నుంచి మొదటి పాట 'రెబల్ సాబ్'ను విడుదల చేసింది. తమన్ స్వరాలు సమకూర్చిన పాట ప్రస్తుతం ట్రెండ్ అవుతోంది.

ఇకపోతే మారుతి వివాదంలో చిక్కారు. మైక్ ముందు ఉంది కదా అని ఏదో ఒకటి అనేస్తున్నారు.. ట్రోల్స్ కు గురవుతున్నారు.. మళ్లీ తిరిగి క్షమాపణలు కోరుతున్నారు. తాజాగా డైరెక్టర్ మారుతీ.. ఎన్టీఆర్ ఫ్యాన్స్ కు క్షమాపణలు చెప్పాడు.రిలీజ్ డేట దగ్గరపడుతుండడంతో ప్రమోషన్స్ మొదలుపెట్టిన మారుతీ.. రాజా సాబ్ నుంచి రెబల్ సాబ్ అంటూ సాగే సాంగ్ ను రిలీజ్ చేశారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్ లో మారుతీ.. ఎన్టీఆర్ ని అవమానించడంటూ ఫ్యాన్స్ రచ్చ చేయడం మొదలుపెట్టారు. ఈ ఈవెంట్ లో మారుతీ మాట్లాడుతూ.. 'కాలర్ ఎగరేసుకుంటారు.. అట్లా చెప్పను. ఎందుకంటే అవ్వన్నీ ఆ కట్ అవుట్ ముందు చాలా చిన్నవి అయిపోతాయి. నేను ప్రస్తుతం రెబెల్ యూనివర్సిటీలో చదువుకుంటున్నా. ప్రభాస్ ఫోటో జేబులో ఉంటే చాలు ఎలాంటి డైరెక్టర్ అయిన టాప్ డైరెక్టర్ అయిపోతాడు' అంటూ చెప్పుకొచ్చాడు. వార్ 2 ఈవెంట్ లో ఎన్టీఆర్ ఇలానే కాలర్ ఎగరవేసి తమ సినిమా హిట్ అవుతుందని చెప్పాడు. ఇప్పుడుమారుతీ ఎన్టీఆర్ నే అన్నాడని, తమ హీరోని పొగడడంలో తప్పు లేదు కానీ, వేరే హీరోతో కంపేర్ చేయడం .. ఆ హీరోని అవమానించడమే అని చెప్పుకొస్తున్నారు. ఇక ఈ విషయం పెద్దది కాకుండా మారుతీ ఆదిలోనే తుంచేశాడు. ఫ్యాన్స్ కి సారీ చెప్పి ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టాడు. ' ముందుగా నేను ప్రతి అభిమానికి హృదయపూర్వకంగా క్షమాపణలు కోరుతున్నాను. ఎవరినీ బాధపెట్టడం లేదా అగౌరవపరచడం నా

ఉద్దేశ్యం కాదు. కొన్నిసార్లు మాటల ప్రవాహంలో మనం అనుకున్న మాటలు అనుకున్నట్లు రాకపోవచ్చు. నేను అన్న మాటలు వేరే విధంగా అర్థం చేసుకున్నందుకు నేను చింతిస్తున్నాను.ఎన్టీఆర్ గారి పట్ల మరియు ఆయన అభిమానులందరి పట్ల నాకు అపారమైన గౌరవం ఉంది. సినిమా పట్ల,మీ హీరో పట్ల మీరు చూపే ప్రేమకు నేను నిజంగా విలువ ఇస్తున్నాను. ఇది నేను ఉద్దేశ్యపూర్వకంగా

## పాట విడుదల సందర్భంగా దర్శకుడు మారుతి
## ఎన్టీఆర్ అభిమానులకు క్షమాపణలు



చేయలేదని మనస్ఫూర్తిగా చెప్తున్నాను. ఈ విషయాన్ని అభిమానులు అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను' అంటూ చెప్పుకొచ్చాడు.

# కెవిఎన్ ప్రొడక్షన్‌లో రావిపూడి

ఈతరం దర్శకుల్లో దర్శకుడు అనిల్ రావిపూడి వినోదం ప్రధానంగా ఆయన సినిమాలుంటాయి. ఈ ఏడాది సంక్రాంతికి వెంకటేశ్‌తో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్నారు. వచ్చే ఏడాది మెగాస్టార్ చిరంజీవితో 'మన శంకర వరప్రసాద్‌గారు' సినిమాతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే తాజాగా ఆయన గురించి ఓ వార్త నెట్టింట చక్కర్లు కొడుతుంది. దక్షిణాదిలో భారీ సినిమాలు చేస్తున్న కెవిఎన్ ప్రొడక్షన్‌లో ఓ సినిమా చేయబోతున్నారని వార్తలొచ్చాయి. ఆ వార్తలు నిజమే అన్నట్లు ఆదివారం అనిల్ రావిపూడి పుట్టినరోజు సందర్భంగా క్లారిటీ ఇచ్చారు. ఈ మేరకు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ నిర్మాణ సంస్థ ఓ పోస్ట్ పెట్టడంతో ఈ కాంబోలో సినిమా ఖాయమని క్లియర్ అయింది. అయితే ఇందులో హీరో ఎవరు? అనే వివరాలు వెల్లడించలేదు. ఇదే బ్యానర్‌లో చిరంజీవి - బాబీ కొల్లి సినిమా, యష్, విజయ్ ప్రాజెక్టులు ఉన్నాయి. అలాగే పవన్‌కల్యాణ్, లోకేశ్ కనకరాజ్ కాంబోలో కూడా ఓ సినిమా ఉంటుందని టాక్ నడుస్తోంది.

# విడుదలకు ముందే పెద్ది రికార్డులు

చికిరి చికిరి పాటకు వందమిలియన్ వ్యూస్ విడుదలకు ముందే రికార్డులను తన ఖాతాలో వేసుకుంటోంది 'పెద్ది'. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. దానికి కారణం ఇటీవల విడుదలైన 'చికిరి చికిరి' పాటనే. ఈ పాట రికార్డు స్థాయిలో వ్యూస్‌ను సొంతం చేసుకుంటోంది. 16 రోజుల్లో అన్ని భాషల్లో కలిపి 100 మిలియన్ల వ్యూస్‌ను (10 కోట్ల వ్యూస్) సొంతం చేసుకున్నట్లు టీమ్ తాజాగా తెలిపింది. దీంతో రామ్‌చరణ్ అభిమానులు సంబరపడుతున్నారు. మరోవైపు ఈ పాటలోని హుక్‌స్టెప్ కూడా బాగా వైరలవుతోంది. దీన్ని ఏకంగా సోషల్ మీడియాలో 5 లక్షల మందికి పైగా రీక్రియేట్ చేసినట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. ఇన్‌స్టా, యూట్యూబ్‌లో కలిపి ఇంతమంది దీన్ని రీల్స్ చేసినట్లు వెల్లడించింది. అలాగే హీరో నితిన్ కుమారుడు కూడా ఈ పాటకు చేతులు కదుపుతూ ఎంజాయ్ చేయడం అందరినీ ఆకట్టుకుంటోంది. చికిరి చికిరి... అంటూ సాగే ఈ సాంగ్‌ను ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ స్వరపరచగా, మోహిత్ చౌహాన్ ఆలపించారు. బాలాజీ సాహిత్యం అందించారు. ఇందులో జాన్వీకపూర్ అచ్చియ్యమ్మగా కనిపించనున్నారు.






# నటి శ్రద్ధాకపూర్‌కు గాయం

నటి శ్రద్ధాకపూర్ ప్రస్తుతం 'ఈఠా'లో నటిస్తోన్న సందర్భంగా ఇటీవల ఈ సినిమా షూటింగ్‌లో ఆమె కాలుకు గాయమైంది. దీంతో అభిమానులు ఆందోళన చెందారు. తాజాగా తన హెల్త్ అప్‌డేట్‌ను శ్రద్ధా పంచుకున్నారు. విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలిపారు. ఒక అభిమాని గాయం ఎలా ఉందని పోస్ట్ పెట్టగా దానికి ఆమె రిప్లై ఇచ్చారు. 'పెద్ద దెబ్బ ఏం కాదు.. కాలి కండరానికి దెబ్బ తగిలి కొంచెం ఫ్రాక్చర్ అయింది. డాక్టర్లు విశ్రాంతి తీసుకోమన్నారు. నేను క్షేమంగానే ఉన్నా. త్వరలోనే మీ ముందుకు వస్తాను' అని చెప్పారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో 'ఈఠా' తెరకెక్కుతోంది. ఇటీవల నాసిక్‌లో ఒక భారీ సెట్ వేసి షూటింగ్ నిర్వహిస్తుండగా శ్రద్ధా కాలికి గాయమైంది. భారీ కాస్ట్యూమ్స్ ధరించి డ్యాన్స్ వేస్తుండగా ప్రమాదం జరిగింది. ఎడమ కాలుకు గాయం కావడంతో షూటింగ్‌ను కొన్ని రోజులు నిలిపివేశారు . ఈ సినిమా కోసం ఆమె 15 కిలోల బరువు పెరిగినట్లు కూడా వార్తలు వచ్చాయి.